ఆఖరి మజిలీకి అవస్థలు!

- ఆరాంఘర్ శ్మశానవాటికలో కనీస వసతులు కరువు
- స్నానాలకు అందుబాటులో లేని నీరు
- విద్యుత్ స్తంభాలున్నా..వెలగని లైట్లు
- వేలాడుతున్న తీగలు, భయందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఆరాఘంర్ శ్మశాన వాటికలో కనిపించని విద్యుత్ లైట్లు



సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో చేస్తున్న దహన సంస్కారాలు

మైలార్‌దేవ్‌పల్లి: ఆఖరి మజిలీకి అవస్థలు తప్పడం లేదు. ఓ వైపు హైదరాబాద్ శరవేగంతో అభివృద్ధి చెందుతుంటే శ్మశాన వాటికల్లో మాత్రం కనీస సౌకర్యాలు కరువవుతున్నాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ఆరాంఘర్ శ్మశాన వాటిక ఉన్నది. మార్కండేయనగర్, బాబుల్‌రెడ్డినగర్, గగన్‌పహాడ్, బాబుల్‌రెడ్డినగర్, నేతాజీనగర్, బుద్వేల్, సాయిబాబానగర్ కాలనీల వారు గత 40 ఏళ్లుగా ఇందులోనే దహన సంస్కారాలు చేస్తున్నారు. అయితే దహన సంస్కారాలకు వచ్చిన వారికి కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాలు ఉన్నా.. లైట్లు అమర్చలేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో సెల్‌ఫోన్ లైట్లలోనే దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. వైర్లు కూడా వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. సౌకర్యాలు కల్పించాలని ఎన్నోసార్లు జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్యనే ఓ దాత స్పందించి సొంత ఖర్చులతో బోరు వేయించి నీటి సౌకర్యం కల్పించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే శ్మశాన వాటిక అభివృద్ధి కోసం ప్రైవేట్ వ్యక్తులకు చేయి చాపాల్సిన దుస్థితి ఏర్పడిందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేసి వైకుంఠాధామంలో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



ట్యాంకర్ వద్ద చేతులు కడుగుతున్న ప్రజలు

వసతులు కల్పించాలి..



ఆరాంఘర్ శ్మశాన వాటికలో విద్యుత్ స్తంభాలు ఉన్నా.. లైట్లు లేవు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. రాత్రి సమయంలో దహన సంస్కారాలకు శ్మశాన వాటికలో చీకటి ఉండడంతో సెల్‌ఫోన్ లైట్లు ఉపయోగించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు వైకుంఠాధామంలో కనీస వసతులు కల్పించాలి.

–కోట పవన్, మార్కండేయనగర్ యూత్ అధ్యక్షుడు

ఏసీపీని కలిసిన బీఆర్ఎస్ నేత



శంషాబాద్: బీఆర్ఎస్ జిల్లా యువజన ఉపాధ్యక్షుడు రాచమల్ల సురేశ్ శంషాబాద్ ఏసీపీ కె. శ్రీనివాస్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు పార్టీలకతీతంగా సహకరించాలని ఏసీపీ కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

శంషాబాద్: చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతిచెందింది. ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని రాంనగర్ గుండు ప్రాంతంలో నివాసముంటున్న రాజ్యమ్మ (50) తన చిన్న కుమారుడు శ్రీకాంత్‌తో కలిసి బైక్‌పై సొంతూరు మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండకు వెళ్లింది. సోమవారం సాయంత్రం తిరిగి వస్తుండగా పట్టణంలోని నెక్సా షోరూం సమీపంలో రాజ్యమ్మ కళ్లు తిరిగి కిందపడడంతో తలకు బలమైన గాయలయ్యాయి. వెంటనే స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోకాపేటలో ముగిసిన ఉత్సవాలు



మల్లన్నను దర్శించుకున్న జైపాల్‌రెడ్డి తదితరులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో రెండు రోజులుగా కొనసాగిన మల్లన్న కల్యాణం, సొడమ్మ బోనాల ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు సొడమ్మకు బోనాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కాంగ్రెస్ పీసీసీ సభ్యుడు ముంగి జైపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఓం ప్రకాశ్ రెడ్డి, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీహెచ్ భిక్షపతియాదవ్‌తో పాటు ఆలయ కమిటీ నాయకులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తిరుమలలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



బండ్లగూడ: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ మంగళవారం దర్శించుకున్నారు. ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని స్వామి వారిని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మల్లేశ్‌ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు గోకరి సురేశ్‌గౌడ్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్, నాయకులు పాపయ్యయాదవ్, తలారి పాండు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువులో ఆక్రమణలు తొలగించండి



ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్

మణికొండ: ఇబ్రహీంబాగ్ చెరువు చుట్టు పక్కల ఆక్రమణలు తొలగించడంతో పాటు అందులోని గుర్రపుడెక్కను తీయాలని మణికొండ మున్సిపాలిటీ ఏడో వార్డు కౌన్సిలర్ బి. పద్మారావు ఇరిగేషన్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం వారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్‌ఎండీసీ పరిధిలోని ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువు బాధ్యతలు తీసుకున్నారన్నారు. కొంతవరకు అభివృద్ధి చేసినా పూర్తి స్థాయిలో చేయలేకపోయారన్నారు. దాంతో తిరిగి అందులో గుర్రపు డెక్క పెరిగి దోమల వ్యాప్తికి కారణమవుతుందన్నారు. చుట్టుపక్కలా సర్వే నంబర్లు ఇతరులవి చూపుతూ చెరువుకు చెందిన సర్వేనంబర్ 44లో నిర్మాణాలు చేపడుతున్నారనిఇ పేర్కొన్నారు. చెరువులకి మురుగునీరు వస్తున్న పందెన్‌వాగులోని మట్టి, చెట్లను తొలగించి నీటి ప్రవాహం సాఫీగా జరిగేలా చూడాలని, అలాగే మ్యాన్‌హోళ్లను సరిచేయాలని కోరామన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి



చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: బ్రిటీష్ వారిని ఎదిరించి నేలకొరిగిన గొప్ప స్వాతంత్ర సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ అని బాబుల్‌రెడ్డినగర్‌లోని నవయువ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి అన్నారు. బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కనకవ్వ, యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్ రెడ్డి, నరేశ్ సాగర్, మల్లేశ్, కార్తీక్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు సముచిత స్థానం కల్పించాలి



రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జితో పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు నరేందర్

శంషాబాద్: కాంగ్రెస్‌లో విశిష్ట సేవలందిస్తోన్న దళితులకు పార్టీలో సముచిత స్థానం కల్పించాలని పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ కోరారు. ఈ మేరకు ఆయన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీతో పాటు పదవుల్లోనూ దళితులకు ప్రాధాన్యత కల్పించాలని విన్నవించానన్నారు.

అయోధ్యలో బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు అయోధ్యలోని బాల రాముడిని మంగళవారం దర్శించుకున్నారు. వారిలో నాయకులు హరికిషన్, జి.సత్యనారాయణ ముదిరాజ్, నర్సింగ్ రావు ఉన్నారు.

వైద్య రంగంలో పెట్టుబడులకు మంచి అవకాశాలు

మాదాపూర్: వైద్య ఆవిష్కరణలను అభివృద్ధి చేయడం, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి మార్పిడిని ప్రోత్సహించడంలో ముందుంటామని పశ్చిమ ఆస్ట్రేలియా ఆరోగ్యశాఖ మంత్రి అంబర్ జడే శాండర్సన్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో మంగళవారం ఆరోగ్యం, వైద్యం, లైఫ్ సైన్సెస్‌పై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ దేశంలో వైద్య రంగంలో పెట్టుబడుదారులకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వెస్టర్న్ ఆస్ట్రేలియా బయో ఆసియాతో గ్లోబల్ పార్ట్‌నర్‌గా భాగస్వామ్యం చేసుకున్నట్టు చెప్పారు. హెల్త్‌కేర్, లైఫ్ సైన్స్ రంగాలలో తెలంగాణ రాష్ట్రంతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న క్రీడాపోటీలు



బాల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న మహిళలు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బోధన సిబ్బందికి నిర్వహిస్తున్న క్రీడలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని నలుమూలల నుంచి వచ్చిన విశ్వవిద్యాలయాల సిబ్బంది పాల్గొని క్రీడలతో పాటు సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ చూపుతున్నారు. మంగళవారం జరిగిన బాల్ బ్యాడ్మింటన్‌లో రాజేంద్రగర్ జోన్, క్రికెట్‌లో మధ్య తెలంగాణ జోన్ విజయం సాధించింది. కాగా నేటితో పోటీలు ముగియనున్నాయని నిర్వాహకులు తెలిపారు.



బాల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న పురుషుల జట్టు



క్రికెట్‌లో విజయం సాధించిన జట్టు

పిన్నీస్‌తో తాళం తీసి...

- ద్విచక్ర వాహనాల చోరీ
- ముగ్గురు సభ్యుల ముఠా అరెస్ట్
- ఐదు బైక్‌లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్

సుల్తాన్‌బజార్: బుల్లెట్ వాహనాలను టార్గెట్ చేసుకుని పిన్నీస్‌లతో తాళం తీసి వాటిని చోరీ చేస్తున్న దొంగల ముఠాను సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్, ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్, ముత్తులతో కలిసి వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా, తంగేడకు చెందిన గుంజి రామాంజనేయులు, గోగుల గోపాలకృష్ణ, షేక్ కిసినాపల్లి భాష నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చాకచక్యంగా పిన్నీస్‌తో తాళం తీసి దొంగిలించేవారు. మంగళవారం ముగ్గురు కలిసి రెండు బుల్లెట్‌లపై రామ్‌కోఠి చౌరస్తా మీదుగా వెళ్తుండగా తనిఖీలు నిర్వహిస్తున్న సుల్తాన్‌బజార్ పోలీసులు వాహనాలకు సంబంధించిన పత్రాలు అడగడంతో వారు పొంతన లేని సమాధానం చెప్పారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా తరచూ గుంటూరు నుంచి నగరానికి వచ్చి ఇక్కడ ద్విచక్ర వాహనాలను దొంగిలించి తక్కువ ధరకు రాంకోఠిలో సెకండ్ హ్యాండ్ దుకాణాల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. సుల్తాన్‌బజార్ పరిధిలో ఒకటి, టూ టౌన్‌లో మరో బుల్లెట్, సూర్యాపేట్ చింతల పాలెం పీఎస్ పరిధిలో ఒకటి చోరీ చేసినట్లు గుర్తించారు. వారి నుంచి ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు యజమానులకు సమాచారం అందించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్ ముత్తు, డీఎస్ఐ నరేష్‌లను డీసీపీ రావుల గిరిధర్ అభినందించారు.



'నిధి ఆప్కే నికత్ 2.0' పై అవగాహన



విజయనగర్‌కాలనీ: ప్రావిడెంట్ ఫండ్ సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు రిజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ - 1 సి.రవితేజ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రైవేటు సెక్టార్లలో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు పదవీ విరమణ చెందుతున్న ఉద్యోగులకు అదే నెలలో పెన్షన్ మంజూరు చేసేందుకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (పీపీఓ) అందజేసేందుకు మంగళవారం నిధి ఆప్కే నికత్ 2.0 పేరిట ఆసిఫ్‌నగర్ ఎంఎస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ట్రస్ట్ సంస్థలో పెన్షన్ పేమెంట్ ఆర్డర్ పీపీఓను అందజేశామన్నారు. పీఎఫ్ సమస్యను పరిష్కరించేందుకు కేవైసీ, క్లైమ్ సెటిల్‌మెంట్, పేరు, పుట్టిన తేదీ తదితర సవరణలను పరిష్కరించేందుకు తాము కృషి చేస్తున్నట్లు వివరించారు. ఆర్‌పీఎఫ్‌సీ-2 ఆర్.వివేక్‌రామన్‌రెడ్డి, జిల్లా నోడల్ అధికారి కొండ మురళీధర్, ఎంఎస్ ఎడ్యుకేషనల్ ట్రస్టు హెచ్‌ఆర్ మేనేజర్ అంబా, ఈఎస్ఐసీ మేనేజర్ మహ్మద్ జహిరుద్దీన్‌ఖాన్‌లతో పాటు ఎంఎస్ ఎడ్యుకేషన్ ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

మనూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



మాట్లాడుతున్న వీసీ ప్రొ.ఐనుల్ హసన్

రాయదుర్గం: ప్రతి ఇజమ్ అనేది తాత్కాలికమే అని, వయస్సును బట్టి మార్పులు ఉంటాయని మనూ వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'ఇస్లామిక్ స్టడీస్ ఇన్ ది మాడ్రన్ అండ్ పోస్ట్ మాడ్రన్ ఎరా- యాన్ అసెస్‌మెంట్ ఆఫ్ ఇండియన్ అండ్ ఇరానియన్ స్కాలర్స్' అనే అంశంపై ఇస్లామిక్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు మహ్మద్ ఇషాక్, మహ్మద్ ఫరీదా సిద్దిఖీ, మహ్మద్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



సాక్షి, సిటీబ్యూరో: చిలుకూరులోని శ్రీ శివసాయి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 'స్పార్క్స్ 2.0' పేరిట సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ప్రముఖ శాస్త్రవేత్త, రూరల్ ఇన్నోవేటర్ మండాజి నర్సింహాచారి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. పాఠశాలలోని 800 మంది విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ఎగ్జిబిట్లు అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా నర్సింహాచారి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ చిన్నారులు వారి మెదడుకు పదును పెట్టి తయారు చేసిన ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. కష్టపడి చదువుకుని జీవితంలో ఎదగాలని వారికి సూచించారు. అనంతరం నర్సింహాచారిని పాఠశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రావెంకటేశం



రాయదుర్గం: విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని రాష్ట్ర విద్యాశాఖా ముఖ్య కార్యదర్శి బుర్రావెంకటేశం అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఎస్కీ స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్, రాష్ట్ర కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్, సాంకేతిక విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం 'అకడమిక్ లీడర్‌షిప్ ఎక్స్‌లెన్స్'అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యావిధానం-2020 ఫలితంగా అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. 21వ శతాబ్దానికి అకడమిక్ లీడర్లుగా విద్యార్థులను సన్నద్ధం చేసే లక్ష్యంతో ఎస్కీ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. రేపటి పౌరులుగా ఎదిగేవారిని అందరూ ప్రోత్సహించాలన్నారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ కే వెంకటేశ్వర్‌రావు, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఉమాపతి, ఎఫ్‌డీఎం హెడ్ సాయికిషోర్, పలువురు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

3.84 కిలోల గంజాయి సీజ్

- ఒకరి అరెస్ట్, ద్విచక్ర వాహనం స్వాధీనం

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 3.84 కిలోల గంజాయిని సీజ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద సోమవారం రాత్రి గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో బహదూర్‌పురాకు చెందిన అభినాష్ దత్తను రంగారెడ్డి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు గంజాయిని సీజ్ చేసి శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసుక్ను ఎక్సైజ్ పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఇబ్రహీంబాగ్ చెరువును కబ్జా చేస్తున్నారు



మణికొండ: ఇబ్రహీంబాగ్ చెరువు చుట్టు పక్కల వెలుస్తున్న ఆక్రమణలను తొలగించటంతో పాటు చెరువులోని గుర్రపుడెక్కను తొలగించాలని మణికొండ మున్సిపాలిటీ, 7వ వార్డు కౌన్సిలర్ బి. పద్మారావు ఇరిగేషన్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం వారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ ఇరిగేషన్ శాఖ చెరువును కొంతమేర అభివృద్ధి చేసినా పూర్తి స్థాయిలో చేయలేకపోయారన్నారు. దీంతో గుర్రపుడెక్క పెరిగి దోమల వ్యాప్తికి కారణమవుతుందన్నారు. చుట్టు పక్కల సర్వే నంబర్‌లు వేరేవి చూపుతూ చెరువుకు చెందిన సర్వే నంబర్ 44లో నిర్మాణాలు చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గోల్కొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన గోల్కొండ మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చెక్కుల జారీలో ఆలస్యమైందన్నారు. గతంలో మంజూరైన చెక్కులను విడతల వారీగా విడుదల చేస్తున్నామన్నారు. అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవసరమైన ధ్రువపత్రాలను తప్పనిసరిగా జతచేయాలని ఆయన కోరారు. దళారుల జోలికి వెళ్లకుండా నేరుగా దరఖాస్తు చేసుకునేలా చూడాలని కోరారు. మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, వజీఉజ్‌జమా సిద్ధిఖీ, అమీరుద్దీన్ తదితరులున్నారు.